క్లుప్తంగా

వలగొండను సందర్శించిన ఆర్‌డీఓ



వలగొండలో దళితులతో మాట్లాడుతున్న పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్

ఆస్పరి: ఆస్పరి మండలంలోని వలగొండ గ్రామాన్ని బుధవారం పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ కుమారస్వామి సందర్శించారు. మొహర్రం సందర్భంగా వలగొండ గ్రామంలో జరిగిన ఘర్షణలో గాయపడిన దళిత కుటుంబాలను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దళితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం ఆస్పరి జెడ్పీ హెచ్ స్కూల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌డీఓ తనిఖీ చేశారు. భోజనం రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏంఈఓ రాజేంద్రప్రసాద్ వెంట ఉన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

తుగ్గలి: పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ ఆదేశించారు. రాతన జెడ్పీ పాఠశాలకు సంబంధించి నాడు-నేడు కింద జరుగుతున్న తరగతి గదుల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం అయ్యేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులందరూ పక్కా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టని వారి పట్టా రద్దు చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ-2 రామ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయండి



ఎర్రకోట జగన్‌ను సత్కరిస్తున్న గోనెగండ్ల సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గోనెగండ్ల సింగిల్ విండో అధ్యక్షుడిగా గంజిహళ్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎర్రకోట జగన్‌ను కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనను సింగిల్‌విండో అధ్యక్షుడిగా నామినేట్ చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ రాముడు తదితరులు ఉన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 32వ వార్డు పరిధిలో అనారోగ్యంతో దాస ఆనంద్ అనే వ్యక్తి మృతి చెందడంతో ఆయన భార్య సుమిత్రకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలను వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు బుధవారం అందజేశారు. మిగతా సొమ్ము రూ.లక్ష త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

భూసర్వే పక్కాగా నిర్వహించాలి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పనులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా చేపట్టి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. బుధవారం హంప రెవిన్యూ గ్రామ పరిధి కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం పూర్తి విస్తీర్ణం 10095.95 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 6,967 ఎకరాలలో సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. రోజుకు 800 ఎకరాలు సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో రషీద్, వీఆర్‌ఏలు ఉన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయండి

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపట్టిన ఓటరు సవరణ వేగవంతం చేయాలని ఆలూరు అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు వారి పరిధిలో నిర్వహించే ఓటరు సర్వేను సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే తమకు తెలియజేయాలన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

వెల్దుర్తి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బుధవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కవితాబాయ్ ఆధ్వర్యంలో గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ సాయిప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కమిటీ ప్రతినిధులు హరిసింహనాయుడు, ఖాదర్‌బాష, పాఠకులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత



గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మిగనూరులో బాలింతకు కిట్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

పత్తికొండటౌన్: తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 2 నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందించే కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. బుధవారం పత్తికొండ ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఇక నుంచి ప్రతి నెలా 3 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, అర్ధలీటరు పామాయిల్, 25 గుడ్లు, 2.5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, చిక్కీ 250 గ్రాములు, ఖర్జూరాలు 250 గ్రాములు చొప్పున ఇంటి వద్దకే పంపిణీ చేస్తారన్నారు. గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకుని తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఎంపీపీ నారాయణదాసు, తహసీల్దార్ విష్ణుప్రసాద్, సర్పంచ్ కొమ్ముదీపిక, సీడీపీఓ సావిత్రిదేవి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుమిత్రమ్మ, అంబిక,నాగేశ్వరి,సౌభాగ్యలక్ష్మి,సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు ప్రతి గర్భిణి, బాలింతకు చేరాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సఫర్నుసాబేగం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించి గర్భవతులు, బాలింతలు సంపూర్ణ పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేరని భావించి ఇంటి వద్దకే అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాజశేఖర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వెల్దుర్తి: సంపూర్ణ పోషకాహారం ప్రతి గర్భిణి, బాలింత ఉపయోగించుకుని పిండాభివృద్ధి, ఆరోగ్యకర శిశువు జననం, ఎదుగుదల, తల్లి ఆరోగ్యంతో భావితరాలు బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్/ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ పిల్యాక్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ కిట్ల పంపిణీ, తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథులైన బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ చేతులమీదుగా కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, సూపర్‌వైజర్లు సునీత, సరస్వతి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: ప్రభుత్వం అందజేసే పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని



వెల్దుర్తిలో కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఎంఆర్‌ఓ వెంకటేష్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. నాయకులు తపాల శ్రీనివాసులు, రామచంద్రనాయుడు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆస్పరి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆస్పరి సీడీపీఓ నిర్మలాదేవి అన్నారు. బుధవారం ఆస్పరి-1 అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు పాల్గొని గర్భిణులు, బాలింతులకుపోషకాహార కిట్లను పంపిణీ చేశారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, డాక్టర్ కర్ణాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టీహెచ్‌ఆర్ కిట్లు గర్భిణులు, బాలింతలకు అందించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలన ఆదర్శం



గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న మంత్రి జయరాం

హొళగుంద: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన చరిత్రాత్మకమని, వైఎస్సార్‌సీపీ హయాంలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో చేశారా అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలను ప్రశ్నించారు. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.15.70 కోట్లు అందించినట్లు వివరించారు. బుధవారం మంత్రి తన సోదరుడు నారాయణస్వామితో కలిసి నెరణికి గ్రామంలో సర్పంచ్ కురువ వన్నమ్మ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఐసీడీఎస్ సీడీపీఓ లలితమ్మ, సుపర్‌వైజర్ షీబారాణితో కలిసి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

సత్వర పరిష్కారానికి చర్యలు

గ్రామంలో పర్యటిస్తుండగా ప్రజలు డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మంత్రి స్పందిస్తూ సచివాలయాలకు మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలలో వివిధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, సర్పంచులు వన్నమ్మ, పార్వతిబాయి, ఎంపీటీసీలు సంధ్యభాయి, మల్లికార్జున, కెంచప్ప, వీరనాగప్ప, సోమప్ప, రవి, మంజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో నీరాజనం

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో గడప గడపకు గర్వంగా వెళ్లగలుగుతున్నామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సింగిల్‌విండో అధ్యక్షురాలు విజయలక్ష్మి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర రెడ్డి, అధికారులు, వలంటీర్లతో కలిసి తుగ్గలి మెయిన్ రోడ్డు, బీసీ కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు ఏ పథకం ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో ఇంటింటికీ వెళ్లి వివరించి బుక్‌లెట్ అందించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని.. సీసీ రోడ్లు నిర్మించాలని బీసీ కాలనీ వాసులు విన్నవించారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజా



తుగ్గలిలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు మరోసారి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగ భూషణరెడ్డి, హనుమంతు, హుసేన్, రామచంద్ర, రాజు, రంగనాథరెడ్డి, చాంద్ బాషా, పురుషోత్తం, దేవరాజు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని బుధవారం తహసీల్దార్ ఆంజనేయులు, సీడీపీఓ సఫర్నీసాబేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్, రూరల్, గోనగండ్ల, నందవరం మండాల్లోన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, పోతపాలు కాకుండా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు, సీడీపీఓ సఫర్నీసాబేగం

ర్యాలీలో సూపర్‌వైజర్లు నీలమ్మ, సుచరి, జరీనా, సుధావతి, భాగ్యలక్ష్మి, గుణశేఖరమ్మ, రాధ, ప్రీతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం

ఆలూరు రూరల్: అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక పింఛన్లు అందిస్తోంది. ప్రతి వలంటీర్ తన పరిధిలోని లబ్ధిదారులకు ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి నగదు



కర్నూలు ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్ జయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగేష్

పంపిణీ చేస్తున్నారు. అనారోగ్యాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల పట్ల వలంటీర్లు మానవత్వం చాటుకుంటున్నారు. వందల కిలో మీటర్లు ప్రయాణించి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తూ సేవానిరతి చాటుకుంటున్నారు. రోగాల బారిన పడి ఆర్థికంగా చితికిపోతున్న తమకు సకాలంలో నగదు అందిస్తున్న వలంటీర్లకు లబ్ధిదారులు చేతులెత్తి మొక్కుతున్నారు.



పెంచికలపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరభద్రికి ఫించన్ అందిస్తున్న వలంటీర్ కృష్ణమూర్తి

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన జైనాబీ అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటున్నారు. వలంటీర్ ఖాదర్ బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేసి సేవానిరతి చాటుకున్నారు.

ఆస్పరి: ఆస్పరి మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన వలంటీర్ కృష్ణమూర్తి 90 కి.మీ. దూరం ప్రయాణించి పెంచికలపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు వీరభద్రికి బుధవారం పింఛన్ డబ్బులు అందజేసి ప్రశంసలు పొందారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వృద్ధులకు పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా, సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ జాలవాడి లక్ష్మీ, ఎంపీటీసీ నరసింహులు, జాలవాడి లక్ష్మన్న, శ్రీనివాసులు, గడ్డం తిక్కన్న, తాయన్న, భీమిరెడ్డి, ఎంపీడీవో బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 25వ వార్డులో బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కేఎస్ శివన్నలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలోని లక్ష్మణ్ థియేటర్ ప్రాంతంలో ఆయన పర్య



కోటేకల్‌లో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

టించారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, వైస్‌చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యు.కె.రాజశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు భూమిపూజ

పట్టణంలోని 25వ వార్డులో రూ.3 లక్షలతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్‌కు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి భూమిపూజ చేశారు. అదేవిధంగా అబ్బాస్ టాకీస్ వద్ద సోగనూరు రోడ్డుకు ఇరువైపులా కమిషనర్ గంగిరెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ శివప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు.

క్రైం కార్నర్

ఎడ్ల బండిని ఢీకొన్న జీపు

వెల్దుర్తి: నిద్రమత్తులో జీపు డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టాడు గుర్తు తెలియని వ్యక్తి. బుధవారం తెల్లవారుజామున హైవే-44పై ఈ సంఘటన జరిగింది. వివరాలు.. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన రైతు ఏనుగుల నాగేశ్వరరెడ్డి మదార్‌పురం వైపు గల పొలానికి వెళ్లేందుకు ఎడ్ల బండితో బయలుదేరాడు. డోన్‌వైపు గేట్లు దాటి జాతీయ రహదారి అవతలి వైపు చేరుకుని రహదారి పక్కనుంచి వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా కర్నూలు వైపు వెళ్తున్న టెంపో జీపు రహదారి దిగి ఎద్దులబండి కాడిమానును ఢీకొట్టుకుంటూ వెళ్లింది. కాడిమాను, రైతు కూర్చునే ప్రాంతం ధ్వంసం కాగా, ఎద్దు గాయపడ్డాయి. తేరుకున్న జీపు డ్రైవర్ కర్నూలు వైపు పరారయ్యాడు. రైతు స్థానిక పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. అమకతాడు టోల్‌గేట్ నుంచి జీపు వెళ్లినట్లు గుర్తించారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ శాంతలత ఎద్దులకు చికిత్స అందించారు.

గర్భిణిపై కూలిన కాంపౌండ్ గోడ



గర్భిణి నాగమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేషమ్మ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో బుధవారం ఉదయం ఇంటి ముందు కూర్చున్న బోయ లక్ష్మన్న కుమార్తెలు నాగమ్మ (23), శేషమ్మలపై కాంపౌండ్ గోడ కూలి పడింది. ఇంటి ముందు గేటు ఏర్పాటు చేసుకున్న కాంపౌండ్ గోడ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా తడిసి నెమ్ము తీసుకుంది. ఉదయం అక్కాచెల్లెలు గేటు ముందు కుర్చుని ఉండగా వీరిపై కూలి పడింది. మూడు నెలల గర్భిణి నాగమ్మ నడుముపై పడటంతో తీవ్ర రక్తస్రావం కాగా, శేషమ్మకు కుడి చెయ్యి విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



హనుమక్క (ఫైల్)

మద్దికెర: బురుజుల గ్రామానికి చెందిన కారుమూరు హనుమక్క (105) అనే శతాధిక వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ప్రకాష్‌రెడ్డి, మనవడు సింగిల్ విండో మాజీ చైర్మన్ తమ్మిరెడ్డి మాట్లాడుతూ.. చనిపోయేంత వరకు కంటికి అద్దాలు లేకుండా సొంతంగా పనులు చేసుకునేదని, అలాగే విత్తనాలలో రాళ్లు ఏరివేసేదన్నారు. ఎలాంటి జ్వరం గానీ, అనారోగ్యం గానీ లేదని ఆరోగ్యంగా ఉండేదన్నారు. ఆమె మృతి విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెగుళ్లు నివారిస్తేనే అధిక దిగుబడులు

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి, మిరప పైర్లకు సోకిన పురుగులు, తెగుళ్లను నివారించుకుని మంచి దిగుబడులు సాధించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏడీఏ సునీత ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ఆర్బీకేలలో పనిచేస్తున్న ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాలు, నేల స్వభావాన్ని ఎరువులు వాడాలన్నారు. పత్తి, మిరప పైర్లకు ఎర్రతెగులు నివారణ కోసం 19-19 - 19 లేదా 14-0-35 ఐదు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్కలు తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు.అలాగే క్లోరోతాలిన్ 75 శాతం ఒక గ్రాము నీటిలో



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ

కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. వడలు తెగులు నివారణ కోసం లైటాక్స్‌ను మూడు గ్రాములు మొక్కల మొదళ్ల వద్ద వేయాలని సూచించారు. అలాగే పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు జాగ్రత్తలు వివరించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు శశిధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడు, ఆనంద్, దేవభూషణకుమార్, ఏడీఏ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

నందవరం: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఏపీడీ అలిపిర సూచించారు. ఆయన బుధవారం ముగతి గ్రామంలో రైతుల పొలాల్లో మొక్కల పెంకాన్ని ఏపీడీ పరిశీలించారు. అలాగే నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పండ్ల మొక్కల పెంపకంపై 100 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని మునగ, కొబ్బరి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, బంగినపల్లి తదితర తోటలు సాగు చేయాలన్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల ఖాతాలకు ఆధార్ నంబర్లు సీడింగ్ చేయాలని ఆదేశించారు. మండలంలో 132



ముగతిలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ అలిపిర

ఆధార్ సీడింగ్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు కల్పించాలన్నారు. ఎంపీడీఓ దశరథరామయ్య, ఏపీఓ శ్రీనివాసులు, సీఓలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

అవి-ఇవి

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం కింద బోరు, బావులు ఉన్న రైతుల పొలాల్లో పండ్ల తోటల సాగు చేపట్టాలని ఎంపీడీఓ విశ్వమోహన్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన బుధవారం ఆయన సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. మండలంలో వర్షా లు సమృద్ధిగా కురవడంతో దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాల్లో చీని, మామిడి తదితర పండ్ల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పనులకు సంబంధించి రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏపీఓలు అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు, సీఓలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆలూరు రూరల్: మండలంలోని కురువళ్లి గ్రామంలో గురువారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ రవి పత్రిక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో గ్రామంలోని ఆర్బీకే వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీఎకో పరీక్షలతో పాటు, గుండె, ఛాతినొప్పి, ఆయాసం, తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దాడులు చేసిన వారిని శిక్షించాలి

ఆస్పరి: ఆస్పరి మండలం వలగొండ గ్రామంలో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు సంజప్ప, రామాంజనేయులు, పెద్దయ్య, కోదండ డిమాండ్ చేశారు. బుధవారం వారు వలగొండ దళిత కాలనీని సందర్శించి బాధితులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ దళితులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. దాడిలో గాయపడిన దళితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. దళితులపై పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించండి

హాలహర్వి: గ్రామాల్లోని బీఎల్‌ఓలు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ మల్లికార్జున ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు వల్ల కలిగే ప్రయోజనాలు, ఓటు విలువను తెలియజేయాలన్నారు. చనిపోయిన ఓటరులను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. కొత్తగా ఓటుహక్కుకు అర్హత సాధించిన వారి వివరాలను నమోదు చేయాలన్నారు.

పొలంబడితో రైతులకు ప్రయోజనం

హాలహర్వి: పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వీఏఏ రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బిలేహాల్ గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన రైతు ఉలిగప్పకు చెందిన పత్తి పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.పంటల సాగులో మిత్ర పురుగులు, శత్రు పురుగుల గురించి వివరించారు. చార్ట్ ద్వారా సస్యరక్షణ పద్ధతులను వివరించారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో పిరమిడ్ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సీహెచ్ గాయత్రి జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీకి ఎన్నికైనట్లు బుధవారం కరెస్పాండెంట్ పాండు తెలిపారు. సదరు విద్యార్థిని గత నెల 29న గార్లేయపురంలో జరిగిన అండర్-10 విభాగం రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో గాయత్రి పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి, శిక్షణ ఇచ్చిన పీఈటీ సురేష్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆర్‌ఈఏ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు

మద్దికెర: రెవెన్యూ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా డీటీ నాగరాజు, కమిటీ సభ్యులుగా రవికుమార్‌ను ఎంపిక చేయడంపై మండల రెవెన్యూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తహసీల్దార్ నాగభూషణం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా సంఘాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

హాలహర్వి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం పిల్లల డ్రాప్ అవుట్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీడీఓ ఆంథోని, ఎంఈఓ-2 శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం వెంకటరమణ, విద్యాకమిటీ చైర్మన్ అంజనేయులు ఉన్నారు.